
APTEL/25/A2326

# ప్రజలకి చేరువ

సామాన్యుడి ఆయుధం




ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ బుధవారం 11-03-2026 సంపుటి : 1 సంచిక : 179 ఎడిటర్ : కుమార్ పేజీలు : 4 వెల రు : 4/-

Ongole | Srikakulam | Vizianagarm | Visakhapatnam | Rajahmundry | Kakinada | Elugu | Vijayawada | Guntur | Kurnool | Kadapa | Chittore | Warangal | Srikakulam | Hyderabad | Mehabubanagar

### రూ.8.8 లక్షల కోట్ల భారీ ప్రాజెక్టులకు


## కేంద్ర కేబినెట్ ఆమోదం

- జల్ జీవన్ మిషన్ గడువును 2028 డిసెంబర్ వరకు పొడిగింపు
- రైల్వే నెట్ వర్క్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్
- రహదారి కనెక్టివిటీ, విమానాశ్రయ అభివృద్ధికి ప్రాధాన్యం
- కేంద్ర కేబినెట్లో కీలక నిర్ణయాలు



దేశాభివృద్ధికి సంబంధించి కేంద్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ వివరాలను వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తూ ఏకంగా రూ.8.8 లక్షల కోట్ల విలువైన ఆరు భారీ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న ఈ నిర్ణయాలు దేశ ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించడమే. కాకుండా, సామాన్యుల జీవన ప్రమాణాలను గణనీయంగా పెంచనున్నాయి. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ వివరాలను మీడియాకు వెల్లడిస్తూ, ప్రభుత్వం చేపడుతున్న ఈ సంస్కరణలు భవిష్యత్ భారత్ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

## స్పీకర్పై కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానంపై లోక్ సభలో చర్చ



### లాభాల్లో స్టాక్

## మార్కెట్లు



ఇరాన్ యుద్ధం త్వరలో ముగియవచ్చన్న ట్రంప్ వ్యాఖ్యలతో సానుకూల సంకేతాలు 640 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్, 233 పాయింట్లు పెరిగిన నిఫ్టీ సూచీలను మించి రాణించిన మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ షేర్లు

### చైనా ఎఫ్ డీఐలకు కేంద్రం

## గ్రీన్ సిగ్నల్!



భారత్ సరిహద్దును పంచుకునే దేశాల నుంచి వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విషయంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## స్వయం ఆర్థిక ప్రాజెక్టులపై దృష్టి


- క్రీడలు, పర్యాటక రంగాలకు భారీ ప్రాధాన్యం పెట్టుబడుల కోసం కంపెనీలతో నిరంతర సంప్రదింపులు
- 59వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో కీలక నిర్ణయాలు



తెలుగు జాతి వైభవాన్ని ప్రపంచానికి చాటేలా అమరావతిని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు గర్వంగా అందించేలా రాజధాని నిర్మాణం జరగాలని అధికారులకు సూచించారు. రాజధానిలో స్వయం ఆర్థిక ప్రాజెక్టులు చేపట్టడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం అధ్యక్షతన జరిగిన 59వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

## ఎండల తీవ్రతపై అప్రమత్తం

- 'హీట్వేవ్ యాక్షన్ ప్లాన్-2026' ఆవిష్కరణ - మధ్యాహ్నం 12 నుంచి 4 వరకు బహిరంగ పనుల సమయాలు మార్చాలి - ప్రాణ నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలి - హోం, విపత్తు నిర్వహణల మంత్రి అనిత



రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో మనుషులు, పశువుల ప్రాణ నష్టం లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. తాడేపల్లిలోని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ఏపీఎస్డిఎంఏ ) కార్యాలయంలో కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు, విపత్తు నిర్వహణ సంస్థ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 'హీట్వేవ్ యాక్షన్ ప్లాన్ - 2026'ను మంత్రి ఆవిష్కరించారు.

## రైతులకు ఎటువంటి కొరత లేకుండా ముందస్తు ప్రణాళికతో ప్రభుత్వం చర్యలు

- గత ప్రభుత్వ కాలంలో పెండింగ్లో ఉన్న పరిహారాలను కూటమి ప్రభుత్వం విడుదల చేసింది - యూరియా సరఫరా, ఆర్థిక సహాయంలో ప్రభుత్వం ముందంజ
- ఇన్పుట్ సబ్సిడీ పెంపు, పంటల బీమా సంస్కరణలు - రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు



రాష్ట్రంలో రైతులు పండించిన పంటలకు మద్దతు ధర దక్కడం లేదంటూ వైసీపీ నేతలు మొసలికన్నీరు కారుస్తున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రంగా మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంపై కావాలనే తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ మంగళవారం విజయవాడ క్యాంప్ కార్యాలయం నుండి ఓ ప్రకటన విడుదల చేశారు.

## ప్రధానితో ఆర్. కృష్ణయ్య భేటీ!



- కుటుంబ సభ్యులతో ప్రధాన మంత్రి 30నిమిషాల చర్చ - బీసీ విద్య, ఉద్యోగ, రిజర్వేషన్లలో విస్తరణకు కేంద్రానికి డిమాండ్లు - కేంద్ర బడ్జెట్లో రెండు లక్షల కోట్లు, పోస్ట్- మెట్రిక్స్ స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ - దశలవారీగా అన్ని రంగాల్లో సమాన హక్కులు కల్పించేందుకు ప్రధాన మంత్రి హామీ

## ఏపీలో 11 మున్సిపల్ కార్పొరేషన్లకు ప్రత్యేక అధికారుల నియమాకం




అమరావతి: ఏపీ వ్యాప్తంగా 11 మున్సిపల్ కార్పొరేషన్లు, 75 మున్సిపాలిటీలు, నగరపంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఇవాళ్టి నుంచి 6 నెలలు లేదా ప్రజాప్రతినిధులు ఎన్నికయ్యేవరకు ప్రత్యేక అధికారులు పాలన సాగించనున్నారు. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కడప, కర్నూలు, అనంతపురం, ఒంగోలు, విజయనగరం, మచిలీపట్నం, చిత్తూరు కార్పొరేషన్లలో ప్రత్యేక అధికారుల పాలన సాగనుంది. ఈ మేరకు పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్కుమార్ నోటిఫికేషన్ జారీ చేశారు.

## ఏపీలో గ్యాస్ కొరత లేదు.. ఆందోళన వద్దు: మంత్రి నాదెండ్ల



అమరావతి: రాష్ట్రంలో ఎల్పీజీ కొరత లేదని, ప్రజలు అనవసర ఆందోళనకు గురికావొద్దని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ భరోసా ఇచ్చారు. గృహ అవసరాలతోపాటు వాణిజ్య అవసరాలకు సరిపడా గ్యాస్ నిల్వలు ఉన్నాయని, ప్రస్తుతానికి ఇబ్బందేమీ లేదన్నారు. గ్యాస్ అక్రమంగా బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా జిల్లాల జాయింట్ కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.ఇష్టానుసారం ధరలు పెంచినా, వదంతులు వ్యాప్తి చేసినా.. కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గృహావసరాలకు ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకుంటున్నామని, అవసరమైతే ప్రాధాన్యం ప్రకారం వాణిజ్య అవసరాలకు గ్యాస్ అందించే ఏర్పాటు చేస్తామన్నారు. రోజువారీ అవసరాలకు సరిపడా గ్యాస్ నిల్వల్లో ఏమాత్రం తేడా వచ్చినా.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ముందుకు వెళ్తామన్నారు.

# మండలంలో పదో తరగతి పరీక్షా కేంద్రాల పరిశీలన

పొన్నలూరు : ప్రజలకి చేరువ


మండలంలో త్వరలో ప్రారంభం కానున్న పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు సంబంధించి విద్యాశాఖ అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని పొన్నలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు ఇప్పగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేశారు. ఈ రెండు కేంద్రాల్లో కలిపి మొత్తం 340 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పొన్నలూరు సెంటర్ పరిధిలో పొన్నలూరు, చెన్నిపాడు, ముండ్లమూరివారిపాలెం, చెరువుకొమ్ముపాలెం, ముప్పాళ్ళ జడ్పీ పాఠశాలలతో పాటు స్థానిక గిరిజన



సంక్షేమ ఆశ్రమ పాఠశాల మరియు రెండు ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 246 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అలాగే ఇప్పగుంట సెంటర్ పరిధిలో ఇప్పగుంట జడ్పీ పాఠశాల మరియు కేజీబీవీ బాలికల విద్యాసంస్థకు చెందిన 94 మంది విద్యార్థులు తమ పరీక్షలను పూర్తి చేయనున్నారు. ఈ నేపథ్యంలో, మంగళవారం నాడు మండల విద్యాశాఖ అధికారులు రవిచంద్రబాబు, సుబ్బరామయ్యలు సంబంధిత చీఫ్ సూపరింటెండెంట్లు మరియు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లతో కలిసి ఆయా కేంద్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గదుల్లో సరిపడా బల్లలు, తాగునీటి వసతి మరియు మరుగుదొడ్ల సౌకర్యాలను తనిఖీ చేసి, అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వారు వెల్లడించారు. ఈ తనిఖీ కార్యక్రమాల్లో చీఫ్ సూపరింటెండెంట్లు ఎల్. అనురాధ, ఆర్వెట్ల శ్రీనివాసులు మరియు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు వై. వెంకటేశ్వరరావు, శ్యాం సుధాకర్ పాల్గొన్నారు. పరీక్షల సమయంలో కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత కోసం 144 సెక్షన్ అమలు చేయాలని కోరుతూ పోలీసు శాఖకు మరియు విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా వైద్య సౌకర్యాలు కల్పించాలని కోరుతూ వైద్య ఆరోగ్య శాఖకు ఇప్పటికే విజ్ఞప్తి లేఖలు అందజేసినట్లు అధికారులు ఈ సందర్భంగా తెలియజేశారు.

# కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అధికారులు మరియు నాయకులు





పీసీ పల్లి : ప్రజలకి చేరువ

స్థానిక పీసీ పల్లి సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు మేలు చేకూర్చే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అగ్రికల్చరల్ డిపార్ట్మెంట్ ఏడీ ఎస్.కే. జైముల్లాదీన్ మరియు ఏఓ రంగకృష్ణ హాజరై కేంద్రం పనితీరును పరిశీలించారు. సొసైటీ బ్యాంక్ డైరెక్టర్ ఉండేల పిచ్చిరెడ్డి కొనుగోలు ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించి, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా ఈ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ రైతులు తమ కందులను విక్రయించుకోవాలని సూచించారు. సొసైటీ సీఈఓ భాషా ఈ ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వేము రామయ్య, గ్రామ కమిటీ అధ్యక్షులు కంచర్ల వెంగయ్య, ప్రధాన కార్యదర్శి మూలే సత్తిరెడ్డి పాల్గొని రైతులకు మద్దతుగా నిలిచారు. అలాగే మండల క్లస్టర్లు పులి ప్రతాప్ రెడ్డి, ఏనుగంటి నాగేంద్రబాబు మరియు పలువురు స్థానిక నాయకులు, రైతులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ కేంద్రం అందుబాటులోకి రావడం పట్ల స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కనిగిరి 7వ వార్డులో డ్రైనేజీ పనుల పరిశీలన





## – ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యమని వెల్లడి

కనిగిరి : ప్రజలకి చేరువ

ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు మరియు కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి ఆదేశాల మేరకు కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు కొత్తూరు బిసి కాలనీలో నూతనంగా చేపట్టిన డ్రైనేజీ పనులను తెలుగుదేశం పార్టీ నాయకులు మంగళవారం పరిశీలించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనుల నాణ్యతను తనిఖీ చేసిన నాయకులు, పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.?ఈ కార్యక్రమంలో టౌన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ ఫిరోజ్, టౌన్ తెలుగుయువత అధ్యక్షులు అచ్చులా రవి, ఒంగోలు పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి షేక్ షరీఫ్ లు పాల్గొని పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. వారితో పాటు నాయకులు ఉండేలా శ్రీను, నాగ పాతూరు, నాగేంద్ర, రమేష్ తదితరులు ఈ పరిశీలనలో భాగస్వాములయ్యారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహా రెడ్డి ప్రాధాన్యతనిస్తున్నారని, వార్డుల్లో మౌలిక వసతుల కల్పనలో రాజీ పడబోమని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు.

# గంజాయి ముఠా గుట్టురట్టు

## – ముగ్గురు నిందితుల అరెస్ట్, 3 కిలోల గంజాయి స్వాధీనం

గిద్దలూరు : ప్రజలకి చేరువ

గిద్దలూరు పోలీసులు గంజాయి అక్రమ రవాణా మరియు విక్రయాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి నుండి భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ప్రజలకు చేరువగా ఉంటూ నేర నియంత్రణలో భాగంగా గిద్దలూరు పోలీసులు ఈ విజయాన్ని సాధించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తే, కృష్ణం శెట్టిపల్లె గ్రామానికి చెందిన అలమూరి చంద్రయ్య (ఏ1), దేగపాటి వెంకటేష్ అలియాస్ లడ్డు (ఏ2) మరియు వెంగళరెడ్డిపల్లె గ్రామానికి చెందిన బిజ్జం వెంకట శ్రీరాంరెడ్డి అలియాస్ ఇంద్రసేనా రెడ్డి (ఏ3) అనే ముగ్గురు వ్యక్తులు




అక్రమంగా గంజాయి విక్రయిస్తూ పోలీసులకు చిక్కారు. ?ఈ నిందితులు సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో గంజాయి విక్రయాలను వృత్తిగా ఎంచుకున్నారు. ప్రధాన నిందితుడు చంద్రయ్య విజయనగరం ప్రాంతం నుండి రైలు మార్గంలో గంజాయిని తీసుకువచ్చి, మిగిలిన నిందితులకు సరఫరా చేసేవాడు. వీరంతా కలిసి గిద్దలూరు పట్టణం మరియు చుట్టుపక్కల గ్రామాల్లోని వ్యక్తులకు 10 గ్రాముల గంజాయిని 500 రూపాయల చొప్పున విక్రయిస్తూ అక్రమంగా సంపాదిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో కృష్ణం శెట్టిపల్లి నుండి ఉప్పలపాడు గ్రామం మధ్యలో గల బ్రిడ్జి వద్ద నిందితులందరూ కలిసి గంజాయిని ప్యాకెట్లుగా సిద్ధం చేస్తుండగా గిద్దలూరు పోలీసులు వ్యూహాత్మకంగా దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు.?నిందితుల నుండి సుమారు 30,000 రూపాయల విలువ చేసే 3 కిలోల గంజాయితో పాటు, గంజాయిని తూకం వేయడానికి ఉపయోగించే ఎాఖీ-400 డిజిటల్ ఎలక్ట్రానిక్ చిన్న కాటాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై గిద్దలూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన ఇన్స్పెక్టర్ సురేష్, ఎస్.ఐ. ఇమ్మానియేల్ మరియు పోలీసు సిబ్బందిని మార్కాపురం జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. మాదకద్రవ్యాల విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

# ఉచిత గర్భాశయ క్యాన్సర్ నివారణ టీకా పంపిణీ కార్యక్రమం

కందుకూరు : ప్రజలకి చేరువ




పట్టణంలోని బాలికల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన హెచ్‌పివి వైరస్ టీకా పంపిణీ కార్యక్రమం కందుకూరులో ప్రారంభం కానుంది. గర్భాశయ క్యాన్సర్‌కు ప్రధాన కారణమయ్యే ఈ వైరస్‌ను ప్రాథమిక దశలోనే అరికట్టేందుకు 15 ఏళ్లలోపు బాలికలందరికీ ఈ టీకాను ప్రభుత్వం ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ నేపథ్యంలో, కందుకూరు పట్టణంలోని కోవూరు రోడ్డు, జనార్ధన కాలనీలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీకా పంపిణీ కార్యక్రమాన్ని శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు మధ్యాహ్నం 2 గంటలకు అధికారికంగా ప్రారంభిస్తారు. 15 సంవత్సరాల లోపు వయస్సు గల బాలికల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వ వైద్యశాలల్లో ఉచితంగా లభించే ఈ టీకాను వేయించి తమ పిల్లల భవిష్యత్తుకు ఆరోగ్య భద్రత కల్పించాలని కోరడమైనది. ఈ కార్యక్రమానికి కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు మరియు పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేయడం జరిగింది

# నేడు మండలంలో విద్యుత్ నిలిపివేత



పొన్నలూరు : ప్రజలకి చేరువ

మండలంలోని పొన్నలూరు విద్యుత్ సబ్-స్టేషన్ పరిధిలో గల 11 కేవీ ముప్పాళ్ళ ఫీడర్‌కు అత్యవసర మరమ్మత్తులు నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మరమ్మత్తుల కారణంగా బుధవారం (మార్చి 11) ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.?ముఖ్యంగా వి.కె.డి. కండ్రిక, ముత్రాస్ పాలెం, సింగరభట్ల పాలెం, ముప్పాళ్ళ, ఆజీ పాలెం, వెల్లటూరు, వేంపాడు, ఉప్పలదిన్నె మరియు రావులకొల్లు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. నిర్ణీత సమయంలోగా మరమ్మత్తు పనులు పూర్తి చేసి సరఫరాను పునరుద్ధరిస్తామని, విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి శాఖకు సహకరించాలని ఏఈ విజ్ఞప్తి చేశారు.

# కూచిపూడి లో పంట నమోదు సామాజిక తనిఖీ




మర్రిపూడి : ప్రజలకి చేరువ

కూచిపూడి గ్రామంలో రబీ 2025-26 పంట నమోదు చేసిన రైతుల వివరాలను సామాజిక తనిఖీ మంగళవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి వెంకటేష్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకటేష్ మాట్లాడుతూ రబీ 2025-26 పంట కాలం నందు పంట నమోదు చేసిన రైతుల వివరాలను మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల నందు సామాజిక తనిఖీ నిమిత్తం లిస్టులను డాష్ బోర్డులలో ఉంచాలని గ్రామ వ్యవసాయ సహాయకులకు ఆదేశాలు జారీ చేశారు. మండలంలోని రబీలో పంటలు వేసిన రైతులందరూ మీయొక్క పంట నమోదు వివరాలను సరిచూసుకొని, ఏవైనా తప్పులు ఉన్నచో గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియజేసి సవరణలు చేసుకోవాల్సిందిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు కోటిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రాల ఆధ్వర్యంలో పరిశుభ్రత వారోత్సవాలు...



మద్రిపూడి : ప్రజలకి చేరువ
అంగన్వాడి పరిశుభ్రత వారోత్సవాలలో భాగంగా మార్చి 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు పరిశుభ్రత వారోత్సవాల కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తల్లులతో ఇంటింటి పరిశుభ్రత పై ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నామని చిమట సచివాలయం పరిధిలోని అంగనవాడి కార్యకర్తలు తెలిపారు,మంగళవారం నాడు మండలంలోని చిమట అంగన్వాడి కేంద్రాల కార్యకర్తల ఆధ్వర్యంలో వారోత్సవాల కార్యక్రమం మరియు బాల్య వివాహాల పై అవగాహన సదస్సు నిర్వహించారు, ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినిలు,తల్లులకు ఇంటింటి పరిశుభ్రతపై మరుగుదొడ్లు మరియు చేతులు కడిగే ప్రదేశాల శుభ్రత గురించి పిల్లలకు చేతులు కడుక్కునే సరైన పద్ధతులపై ప్రదర్శించటం జరిగింది, ఈ కార్యక్రమంలో కె స్వాతి,రాధ జ్యోతి, లక్ష్మి కుమారి,పాఠశాల ఉపాధ్యాయులు , తల్లులు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# చీమలేటిపల్లి గ్రామ ప్రజల ఆందోళన

- శుభ్రమైన నీటి సరఫరా అందించేలా చర్యలు తీసుకోవాలి





అర్ధవీడు: ప్రజలకు చేరువ
అర్ధవీడు మండలం చీమలేటిపల్లి గ్రామంలో ఉన్న నీటి పైప్ పగిలిపోయి చాలా రోజులుగా నీరు లీక్ అవుతోంది. ఆ లీక్ అవుతున్న నీరు చుట్టూ ఉన్న మురికి, చెత్త కలసి పూర్తిగా కలుషితమవుతోంది. ప్రస్తుతం అదే నీటిని మేము ఇంటి అవసరాల కోసం ఉపయోగించాల్సి వస్తోంది.దీనివల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. అందువల్ల దయచేసి వెంటనే ఈ సమస్యను పరిశీలించి పగిలిన నీటి పైప్‌ను మరమ్మత్తు చేయించి, శుభ్రమైన నీటి సరఫరా అందించేలా చర్యలు తీసుకోవాలని వినమ్రంగా కోరుకుంటున్నాము.

# గ్రామానికి తారురోడ్డు మంజూరు...!

- శాసనసభ్యులుకి గ్రామ ప్రజల ఘన సన్మానం...



కంభం: ప్రజలకు చేరువ
కంభం మండలం ఎర్రబాలెం గ్రామానికి ఎన్నో సంవత్సరాలుగా సరైన రోడ్డు మార్గం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిన వెంటనే స్పందించిన శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి గారు 1 కోటి 50 లక్షల రూపాయల తో కొత్త తారురోడ్డు మంజూరు చేయించి పనులను పూర్తి చేయించారు.రోడ్డు నిర్మాణం పూర్తవడంతో గ్రామ ప్రజలు, నాయకులు ఆనందం వ్యక్తం చేస్తూ శాసనసభ్యులు కి శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.ఌఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల సమస్యను పరిష్కరించిన శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.గ్రామ అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటామని శాసనసభ్యులు పేర్కొన్నారు..

# పేకాట ఆడుతున్న ఆరుగురు అరెస్ట్



అర్ధవీడు: ప్రజలకు చేరువ
మార్కాపురం జిల్లా అర్ధవీడు మండలం యాచవరం గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని మంగళవారం స్థానిక ఎస్సై నాంచారయ్య అదుపులోకి తీసుకున్నారు. పేకాట ఆడుతున్న వారి వద్ద నుంచి రూ.27,000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. పేకాట ఆడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేశామని పేకాట ఆడటం చట్టరీత్యా నేరమని ఎస్సై నాంచారయ్య మండల ప్రజలను తీవ్రంగా హెచ్చరించారు. మండలంలో ఎక్కడన్నా పేకాట ఆడుతున్నట్లు గుర్తిస్తే 100 నంబర్ కు ప్రజలు ఫోన్ చేసి సమాచారం ఇవ్వవచ్చని అన్నారు.

# లింగ సమానత్వం పై అవగాహన కార్యక్రమం

- పురుషులకు వంటల పోటీలు




చంద్రశేఖరపురం, ప్రజలకు చేరువ
సమాజంలో మహిళా పురుష సమానత్వాన్ని పెంపొందించేందుకు లింగ సమానత్వం పై కనిగిరి పట్టణంలోని పాతూరు అంగన్వాడీ కేంద్రం నందు మంగళవారం మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ సహకారంతో కనిగిరి మండల న్యాయ సేవాధికార సంస్థ,ఐ.సి.డి.ఎస్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఎన్.జి.ఒ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్మన్ న్యాయవాది షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి మహిళా పురుష సమానత్వం ఎంతో ముఖ్యమని తెలిపారు.మహిళల పట్ల గౌరవ భావం కలిగి ఉండడం,లింగ వివక్షను నివారించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.అలాగే మహిళల హక్కులు, మహిళలపై హింస మరియు వేధింపులను నిరోధించే చట్టాలు, బాల్య వివాహాల నిర్మూలన బాలికల విద్య ప్రాముఖ్యత వంటి అంశాలపై పాల్గొన్న వారికి అవగాహన కల్పించారు.పారా లీగల్ వాలంటీర్ గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ కుటుంబం,విద్యా సంస్థలు,ఉద్యోగ ప్రదేశాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.మహిళలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారికి భద్రత మరియు గౌరవం కల్పించడం ద్వారా సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు.ఈ సందర్భంగా మహిళా పురుష సమానత్వాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో పురుషులకు వంటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పలువురు పురుషులు ఉత్సాహంగా పాల్గొని తమ వంట నైపుణ్యాన్ని ప్రదర్శించారు. పోటీల్లో ప్రతిభ కనపరిచినవారిని అభినందించారు.ఈ కార్యక్రమం ద్వారా గృహ పనుల్లో కూడా మహిళలకు పురుషులు సమానంగా సహకరించాలని సందేశం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఐ సి డి ఎస్ సిబ్బంది అంగన్వాడీ టీచర్లు పి. జిని,బి.మల్లేశ్వరిఎం.వెంకటరత్నం, మహిళలు,పిల్లల తండ్రులు,యువత, స్థానిక ప్రజలు,గుడ్ హెల్ప్ ప్రతినిధులు,న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టెట్ నుండి మినహాయింపు కోరుతూ ఢిల్లీలో ఏపీటీఎఫ్ ధర్నా







చంద్రశేఖరపురం, ప్రజలకు చేరువ
టెట్ నోటిఫికేషన్ విడుదలకు ముందు ఎంపికైన ఉపాధ్యాయులను టెట్ పరీక్ష నుండి మినహాయించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో మండలం నుండి ఏపీటీఎఫ్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్ మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం ప్రకారం సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు కూడా టెట్ పరీక్షలు ఉత్తీర్ణులు కావాలని, లేనిపక్షంలో ఉద్యోగం నుండి తొలగించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన పరిస్థితి ఉందన్నారు.ఈ తీర్పుకు కారణమైన విద్యా హక్కు చట్టాన్ని సవరించాలని, టెట్ నోటిఫికేషన్ రాకముందే ఎంపికైన ఉపాధ్యాయులను టెట్ నుండి పూర్తిగా మినహాయించాలని డిమాండ్ చేస్తూ ఈ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్తో పాటు మండల శాఖ అధ్యక్షులు తోట శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి జె.ఎస్. ఆనంద్ బాబు, జిల్లా కార్యదర్శి జి. రామకృష్ణ, మండల నాయకులు డి. సుబ్బరాయుడు, జి. వెంకటేశ్వర్లు, ఇండ్ల ప్రసాద్, ఆర్ సుబ్బయ్య, దండే శ్రీనివాసులు, నన్నసాని గాంధీ, యస్ వహీదా, టి రమేష్, బి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు

# ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఏపీవో సుబ్బారావు



చంద్రశేఖరపురం, ప్రజలకు చేరువ
మండలంలోని కోవిలంపాడు గ్రామంలో ఉన్న అనంతరాములు కుంట వద్ద జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులను మంగళవారం ఏపీవో సుబ్బారావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల ప్రగతి, నాణ్యత, కూలీల హాజరు రిజిస్టర్ ను పరిశీలించి అక్కడ పనిచేస్తున్న కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పనులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. గ్రామాల్లో ఇంకా ఎక్కువ మందికి పనులు కల్పించేలా కూలీల సంఖ్యను పెంచాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కూలీలకు పనులు అందించడంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, కూలీలకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు పూర్తి చేస్తే వారికి పూర్తి స్థాయిలో దినసరి కూలీ లభిస్తుందని తెలిపారు. కూలీలు సమయానికి పనులకు హాజరై విధిగా పనులు పూర్తి చేయాలని సూచించారు.ప్రస్తుతం ఎండాకాలం తీవ్రంగా ఉండటంతో కూలీలు తమ ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఉదయం తొందరగా వచ్చి పనులు చేయాలని ఆయన సూచించారు. అవసరమైనప్పుడు విశ్రాంతి తీసుకోవడం, తగినంత తాగునీరు తీసుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు గ్రామాల అభివృద్ధికి కూడా తోడ్పాటు అందుతుందని అన్నారు గ్రామాల్లో చెరువులు కుంటలు శుభ్రపరిచే పనులు మట్టి పనులు చేపట్టడం ద్వారా పశు పోషకులకు కూడా ప్రయోజనం కలుగుతుందని అన్నారు తనిఖీ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ కిషోర్, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు

# సావిత్రిబాయి పూలే వర్ధంతి వేడుకలు ఘనంగా నివాళులర్పించిన బీసీ సంక్షేమ సంఘం



కనిగిరి : ప్రజలకి చేరువ
భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సామాజిక విప్లవకారిణి సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమం మంగళవారం కనిగిరి పట్టణంలోని ఖాదీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అత్యంత ఘనంగా నిర్వహించబడింది. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే మహిళా విద్య కోసం పడిన శ్రమను, ఆమె ఎదుర్కొన్న సవాళ్లను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని నాయకులు పేర్కొన్నారు. అణగారిన వర్గాల కోసం, మహిళల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం మరువలేనిదని కొనియాడారు.?"స్త్రీ విద్యా వికాసానికి పునాదులు వేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే. ఆమె ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి."వారు కోరారు.ఈ కార్యక్రమం బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు దేవరాజు గట్టు శివకాశయ్య, నియోజకవర్గం అధ్యక్షులు ఎస్కే నాయబ్ రసూల్ ప్రధాన కార్యదర్శి ఈర్ల విజయరామరాజు, కోశాధికారి పట్నం నరసింహం , ప్రముఖ న్యాయవాది పాశం పిచ్చయ్య, ద్రోణాదుల చెంచులు, నాయి బ్రాహ్మణ నాయకుడు చెరుకూరి చిన కాశయ్య, దేపూరి వెంకటేశ్వర్లు, బొప్పరాజు సుబ్బారావు, కండ్లకుంట గురు ప్రసాద్, టిడిపి మాజీ పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు చింతలపూడి తిరుపాలు, సర్పంచ్ దశరథ, రిటైర్డ్ టీచర్ శేషయ్య, టిడిపి నాయకులు గోన ప్రతాప్, మాచర్ల సుబ్బయ్య, పండు, డ్రైవర్ కలవకూరి వెంకటేశ్వర్లు, శెట్టిపల్లి కొండయ్య, రావినూతల కోటయ్య, గోన ప్రేమ్ కుమార్, గోన భరణ బాస్ తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- ఎంఈఓ రాజాల కొండారెడ్డి

చంద్రశేఖరపురం, ప్రజలకు చేరువ



పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖాధికారి రాజాల కొండారెడ్డి తెలిపారు మండల కేంద్రంలోని సి ఎస్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు రత్నం జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాలను ఆయన మంగళవారం పరిశీలించారు పరీక్షల సమయంలో విద్యార్థులు కింద కూర్చొని రాసేలా ఉండరాదని సూచించారు విద్యార్థులు కూర్చోవడానికి అవసరమైన బల్లలు ఫర్నిచర్ పరీక్షా కేంద్రాలకు సమకూర్చారని అన్నారు అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తనిఖీ చేశారు మెనూ ప్రకారం మాత్రమే విద్యార్థులకు అందించాలని కుకింగ్ ఏజెన్సీలకు దూషించారు పరీక్షా కేంద్రాల పరిశీలన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ ఖాదరున్నీసాబేగం, చీఫ్ సూపరిండెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులు ఉన్నారు

# భైరవేశ్వర స్వామిని సన్నిధిలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి నిర్మలాజ్యోతి




చంద్రశేఖరపురం, ప్రజలకు చేరువ

ప్రకాశం జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ శైవ పుణ్యక్షేత్రమైన భైరవకోనలోని భైరవేశ్వర స్వామి సన్నిధిని మంగళవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఎస్. నిర్మల జ్యోతి దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ముప్పాళ్ల శ్యామ్ సుందర్ రాజు, ఆలయ కార్యనిర్వాహణాధికారి వంశీకృష్ణారెడ్డి సూచనల మేరకు ఆలయ సిబ్బంది ఆమెకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య గోత్రనామాలతో ఆశీర్వదించి అభిషేక పూజలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం తరఫున నిర్మల జ్యోతిని శేష వస్త్రాలతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భైరవకోన మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ గుంటిమడుగు వెంకట రామరాజు, అంబవరం బిసి హాస్టల్ వార్డెన్ వెంకటేశ్వర్లు, ఆలయ సిబ్బంది, ఆలయ అర్చకులు పాల్గొన్నారు

# సన్నపురెడ్డి సురేష్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పాశం రామకృష్ణ

చంద్రశేఖరపురం, ప్రజలకు చేరువ



భారతీయ జనతా పార్టీ జాతీయ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏపీఎస్ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం మండల బిజెపి అధ్యక్షులు పాశం రామకృష్ణ ఆయనకు హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేస్తూ రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రజా నాయకుడని అన్నారు. కిసాన్ మోర్చా ద్వారా రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. భారతీయ జనతా పార్టీ దేశాభివృద్ధి, రైతుల సంక్షేమం, పేద ప్రజల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని రామకృష్ణ పేర్కొన్నారు. ప్రధానమంత్రి నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని తెలిపారు. సన్నపురెడ్డి సురేష్ రెడ్డి రాజకీయ జీవితంలో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని, ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# 1/70 యాక్ట్ తుంగలో తొక్కుతూ అక్రమ వెంచర్లు

- ప్లాట్ ఫర్ సేల్ అని బోర్డులతో మోసం చేస్తారు జాగ్రత్త
- వెంచర్లకు ఎటువంటి అనుమతులు ఉండవు సెక్రటరీ
- 1/70 యాక్ట్ తుంగలో తొక్కుతూ అక్రమ వెంచర్లు
- చుంచుపల్లి తండా పంచాయతీలో అక్రమ వెంచర్
- అక్రమ వెంచర్ల దందా అధికారుల మౌనం
- అనుమతులు లేని లేఅవుట్లతో సామాన్యులకు కుచ్చుటోపి
- నిబంధనలు గాలికి.. అమాయక ప్రజలకు కుచ్చుటోపి
- చుంచుపల్లి అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు





ప్రజలకు చేరువ

చుంచుపల్లి :భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం, చుంచుపల్లి తండా గ్రామ పంచాయతీ పరిధిలో అక్రమ వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. అనుమతులు ఉన్నాయ్ అంటూ అమాయక ప్రజలకు అంటగడుతున్న ప్లాట్లు. పైసా పైసా కూడా పెట్టుకుని పొంతంటే కల నెరవేర్చుకుందాం అనుకునే తరుణంలో రియల్ ఎస్టేట్ ముసుగులో అన్ని అనుమతులు ఉన్నాయ్ అంటూ నమ్మబలుకుతూ ప్లాట్లని అమ్మేస్తారు. ఇక అప్పటినుండి మొదలవుతాయి ప్లాట్ కొనుక్కున్న వారికి కష్టాలు. ఇల్లు కట్టుకుందామంటే అనుమతులు ఉండవు ఇంటి నెంబర్లు రావు. ఇదేంటని ప్రశ్నిస్తే తిరగబడతారు. 1/70 యాక్ట్ లో వెంచర్లు ఎవరు కొనుగోలు చేసిన నష్టపోతారని చుంచుపల్లి తండా గ్రామపంచాయతీ సెక్రటరీ తెలియజేస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ కనీస అనుమతులు లేకుండానే వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ, కనీస అనుమతులు లేకుండానే రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమ లేఅవుట్లను ఏర్పాటు చేస్తున్నారు అధికారుల కళ్ల ముందే జరుగుతున్నా, వారు కనీసం స్పందించకపోవడం వెనుక భారీ స్థాయిలో ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. చుంచుపల్లి తండా పరిసరాల్లో గిరిజన చట్టాలను తుంగలో తొక్కుతూ వెలుస్తున్న పలు వెంచర్లకు కనీస అనుమతులు లేవనేది బహిరంగ రహస్యం. పంచాయతీ సెక్రటరీ సైతం ఇదే చెప్తున్నారు కానీ ప్లాట్లు కొన్న అమాయకులు తర్వాత తెలుసుకుంటున్నారు. ఆకులు కాలాక చేతులు పట్టుకుంటే ఏం లాభం అన్నట్టు ముందు ఎవరు చెప్పినా వినకుండా ప్లాట్లు కొనుగోలు చేస్తారు తర్వాత తలలు పట్టుకుంటారు అధికారుల చుట్టూ తిరుగుతారు కానీ ఎటువంటి ప్రయోజనం ఉండదు. మాయమాటలతో సామాన్యులకు ముప్పు ఏర్పడుతుంది ఇక్కడ ప్లాట్లు కొంటే భవిష్యత్తులో రిజిస్ట్రేషన్లు కాక, సామాన్యులు అప్పుల పాలయ్యే ప్రమాదం ఉంది. మౌలిక వసతులు కల్పిస్తామని నమ్మించి ప్లాట్లు అంటగడుతున్న వ్యాపారులు, తీరా అమ్మేశాక కనుమరుగవుతున్నారు. క్షేత్రస్థాయిలో అక్రమ వెంచర్లు వెలుస్తున్నా, సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. అక్రమ నిర్మాణాలు జరుగుతున్నప్పుడు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. అధికారులు మౌనం వహించడం వెనుక అంతర్యమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారుల మౌనం రియల్ మాఫియాకు వరంగా మారింది. ?చుంచుపల్లి తండా పంచాయతీలో జరుగుతున్న ఈ అక్రమ భూ బాగోతంపై జిల్లా అధికారులు తక్షణమే దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అక్రమ వెంచర్లను గుర్తించి, వాటి ముందు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల వద్ద చోరీకి పాల్పడ్డ యువకులు

- రెండు రోజుల్లో ఏడు ఫోన్లు దొంగిలించారని ఆవేదన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

ప్రజలకు చేరువ



నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట పట్టణంలో ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల వద్ద ఏడు సెల్ ఫోన్లు దొంగిలించడం జరిగిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరీక్ష సమయంలో ప్రగతి కాలేజ్ పక్కనే ఉన్నటువంటి జిఎన్ఆర్ గీతాంజలి స్కూల్ ప్లే గ్రౌండ్ లో తమ వాహనాలను పార్కింగ్ చేసి స్కూటీ డిక్కీలో మొబైల్స్ ను ఉంచి పరీక్షకు హాజరై పరీక్ష పూర్తయిన తర్వాత వచ్చి చూస్తే స్కూటీ లో మొబైల్స్ కనిపించకపోవడంతో విద్యార్థులు ఆందోళనకు గురై పక్కనే ఉన్నటువంటి జిఎన్ఆర్ గీతాంజలి స్కూల్ లోకి వెళ్లి సీసీ కెమెరాలు పరిశీలించగా నెంబర్ ప్లేట్ లేని ఒక స్కూటీపై ముగ్గురు యువకులు వచ్చి చిన్న రాడ్డు సహాయంతో స్కూటీ డిక్కీ ఓపెన్ చేసి 7 ఫోన్లను దొంగతనం చేసినట్లుగా కనిపిస్తుంది. విద్యార్థులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లుగా తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు చాలా జాగ్రత్తగా ఉండాలని ప్రముఖులు స్థానికులు సూచించారు.

# అమరవీరుల స్థూపం వద్ద టీజేఏసీ ఆధ్వర్యంలో మిలియన్ మార్చ్ కార్యక్రమం

ఉద్యమ కారులకు ఘనంగా నివాళులు అర్పించిన జేఏసీ రాష్ట్ర నేత శీను

ప్రజలకు చేరువ

హైదరాబాదులోని గన్ పార్క్ అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మిలియన్ మార్చ్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరులను స్మరించుకుంటూ తెలంగాణ ఉద్యమకారులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారూ అనంతరం జరిగిన బహిరంగ సభలో పలువురు ఉద్యమ నాయకులు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ప్రొఫెసర్ కోదండరాం న్యూ డెమోక్రసీ గోవర్ధన్, సంధ్య ,విమలక్క అంబురాథోడ్ ,గొల్లపల్లి నాగరాజ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అమరవీరులు చేసిన త్యాగాలను ఎప్పటికీ మరవలేమని తెలిపారు.

# ఇంటర్మీడియట్ పరీక్షకు 45 మంది గైర్హాజరు

గిద్దలూరు : ప్రజలకు చేరువ

ఇంటర్మీడియట్ థియరీ పరీక్షల్లో భాగంగా 13 వరోజు మంగళవారంనాడు మొదటి సంవత్సరం విద్యార్థులకు పరీక్ష నిర్వహించబడింది. భౌతిక శాస్త్రం -1 తో పాటు ఒకేషనల్ వారికి బ్రిడ్జి కోర్సు ఫిజికల్ సైన్సెస్ -1 ఈ రోజు నిర్వహించబడ్డాయి. కస్టోడియన్ వి. పూర్ణ చంద్రుడు తనిఖీ నిర్వహించారు. పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు ఎం. మురళీకృష్ణ,ఎ.అల్లూరయ్య,ఆర్. శిరీష కుమారి హాజరు వివరాలను తెలిపారు. పట్టణములోని మూడు పరీక్ష కేంద్రాలకు 678 మంది హాజరవ్వాల్సి ఉండగా 633 మంది హాజరు కాగా 45 మంది గైర్హాజరయ్యారు. కేంద్రాల వారీగా వివరాలిలా ఉన్నాయి. శ్రీ వివేకానంద జూనియర్ కళాశాలలో 231 మందికి 217 మంది హాజరు కాగా 14మంది గైర్హాజరయ్యారు. శ్రీ జీవనజ్యోతి జూనియర్ కళాశాలలో 259 మందికి 244 మంది హాజరు కాగా 15 మంది గైర్హాజరయ్యారు. సాహితి జూనియర్ కళాశాలలో 188 మందికి 172 మంది హాజరై, 16 మంది గైర్హాజరయ్యారు.

# మండల కేంద్రంలో అందుబాటులో ఉన్న యూరియా నిల్వలు

- యాప్ ద్వారా బుక్ చేసుకోవాలని అధికారుల సూచన

ప్రజలకు చేరువ




నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని రైతులకు సాగు అవసరాల కోసం నేడు మండల కేంద్రంలోని రెండు ప్రధాన సేవా కేంద్రాలలో యూరియా నిల్వలు అందుబాటులోకి రానున్నాయి. ఉదయం 10 గంటలకు డిసిఎంఎస్ రైతు సేవా కేంద్రంలో 270 బస్తాల యూరియా అందుబాటులో ఉంటుందని అదేవిధంగా హకా రైతు సేవ కేంద్రంలో 270 చాలా యూరియా నిల్వలు సిద్ధంగా ఉన్నాయని అధికారులు తెలిపారు స్టాక్ పరిమితంగా ఉన్నందున యూరియా బస్తాలు అవసరమైన రైతులందరూ నిర్ణీత సమయానికి యాప్ ద్వారా యూరియాను బుక్ చేసుకోవాలని అధికారులు సూచించారు. ఇకపై యూరియా కొరత లేకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామని అధికార యంత్రాంగం వెల్లడించారు.

# మార్కాపురం జిల్లా డి ఎం హెచ్ ఓ డాక్టర్ వాణిశ్రీ ఆకస్మిక తనిఖీ.



బేస్తవారిపేట:: ప్రజలకు చేరువ

బేస్తవారిపేట మండలం లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డాక్టర్ వాణిశ్రీ ఆకస్మిక తనిఖి చేశారు. హాస్పిటల్ లో ఉండే వైద్యులు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. హాస్పిటల్లో ఉండే రికార్డులు తనకి చేశారు. అనంతరం గ్రామంలో ఉండి వైద్య సేవలు అందించే వారికి హెచ్.పీ.వీ వ్యాక్సిన్ పై అవగాహన కల్పించారు. అలాగే 11 వ తేదీ నుంచి ప్రారంభమై హెచ్ పి వి వ్యాక్సిన్ 14 నుంచి 15 సంవత్సరాల లోపు పిల్లలకు వేయవలసిందిగా సూచించారు. యమ్ ఎల్ హెచ్ పి లు వారికి కేటాయించిన గ్రామాలలో మెరుగైన వైద్య సేవలు అందించాలని, అలాగే వడదెబ్బ తగలకుండా ఉండే విధంగా తగు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బేస్తవారిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబంది పాల్గొన్నారు.